క్లుప్తంగా

వంట పాత్రలు పంపిణీ



మధ్యాహ్న భోజన వంట పాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ జయరాజు

కారేపల్లి: సింగరేణి మండల పరిధిలో 74 పాఠశాలలకు.. 49 పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న కార్మికులకు మాత్రమే వంట పాత్రలను మంగళవారం ఎంఈఓ జయరాజు పంపిణీ చేశారు. పేరుపల్లి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. వంట పాత్రలు లేకపోవటంతో మధ్యాహ్న భోజన వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మధ్యాహ్న భోజన వర్కర్లకు వంట పాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్‌లాల్, చాగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30వరకు ఓపెన్ ప్రవేశాలకు గడువు

కల్లూరు: 2025–26 విద్యాసంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు ఈ నెల 30తో ముగుస్తుందని విజ్ఞాన్ విద్యానికేతన్ ఏఐ కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొనారు. చదువు మధ్యలో ఆపేసిన వారు, పాఠశాలకు రెగ్యులర్‌గా.. అదే విధంగా ఇంటర్ ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు విజ్ఞాన్ విద్యానికేతన్, సెల్ నంబర్ 9985835115, 7093554882 ను సంప్రదించాలని కోరారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి తెలిపారు. ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలు జత చేసిన దరఖాస్తులను ఈనెల 24న సాయంత్రం 4గంటల్లోగా కళాశాలలో అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో 50శాతం, ఇతర అభ్యర్థులు 55శాతం మార్కులు కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, ఎస్‌ఈటీ, ఎస్‌ఈటీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 94402 57256, 94417 86508 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుతాం..

సత్తుపల్లిటౌన్: స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించి సత్తా చాటుతామని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 20 జెడ్పీటీసీ, 288 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. బలమైన అభ్యర్థులను నిలిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రతి ఇంటికి మోదీ సంక్షేమ పథకాలు చేరాయన్నారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, మండల, పట్టణ అధ్యక్షులు విజయ్, శివ, జొన్నలగడ్డ నరేష్, మట్టా ప్రసాద్, రహ్మతుల్లా, పాలకొల్లు శ్రీనివాసరావు, రాంబాబు, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శివ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పిచికారీతో కలుపు నివారణ



పత్తి పైరులో హ్యాండ్ స్ప్రేయర్ల ద్వారా కలుపు నివారణ మందు స్ప్రే చేస్తున్న రైతులు

- మండలంలో 8వేల ఎకరాల్లో పత్తి సాగు
- కూలీల ఖర్చు రూ.6వేలు, స్ప్రేయర్ల ఖర్చు రూ.1,800
- కలుపు మొక్కలకు మాత్రమే స్ప్రే..

తల్లాడ: పంట చేలల్లో కలుపు తీయడం తలకు మించిన భారం అవుతుంది. కూలీలు దొరకకపోవడంతో పాటు కూలీ రేట్లు ఏటా భారీగా పెరిగిపోవడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. దీనికి తోడు పశు సంతతి తగ్గిపోవటంతో.. అరకలు ద్వారా వ్యవసాయం తగ్గుముకం పడుతుంది. అన్నదాతలు కూడా అందుకనుగుణంగా అలవాటు పడుతున్నారు. ముఖ్యంగా పత్తిపైరులో కలుపు నివారణ చర్యల్లో కూడా బ్యాటరీ హ్యాండ్ స్ప్రేయర్ల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది.

ఖర్చు తక్కువ.. సమయం ఆదా..

ప్రస్తుతం 40రోజుల వయసులో పత్తిచేనులో పెరిగిన కలుపుకు హ్యాండ్ స్ప్రేయర్ల ద్వారా కలుపు మందు స్ప్రే చేస్తే ఒక్కరోజులోనే అయిపోతుంది. దీంతో ఖర్చు తక్కువ అవడంతోపాటు సమయం ఆదా అవుతుంది. అదే ఒక ఎకరం పత్తిచేనులో కూలీలతో కలుపు తీయాలంటే రూ.6వేలు ఖర్చుతో పాటుగా నాలుగైదు రోజులు సమయం పడుతుంది. అదే స్ప్రే చేస్తే కూలీకి రూ.1000లు, మందులకు రూ.800 మొత్త కలిపి రూ.1,800 అవుతుంది. ఎకరానికి సుమారు రూ.4వేల వరకు ఖర్చు తగ్గుతుంది.

మండలంలో 8వేల ఎకరాల్లో పత్తి సాగు..

ఖమ్మం జిల్లాలో వరి తర్వాత అధిక విస్తీరణంలో పండిచేంది పత్తిపంట. తల్లాడ మండలంలో ఈ ఏడాది 8వేల ఎకరాల్లో పత్తి పైరు సాగు చేశారు. మండలంలో మే నెలాఖరులో కురిసిన వర్షాలకు, జూన్ మొదటి వారంలో ఖరీఫ్‌లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు పడటంతో పైరు ముందుగానే సాగుచేశారు. ఈ దశలో పైరు గూడ దశలో ఉడడంతో పత్తి మొక్కలకు తగలకుండా కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- పైరులో మొదట 45 నుండి 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి.
- పంట వేసే దగ్గర నుంచి 45 రోజుల వరకు మందులు స్ప్రే చేసుకోవాలి. కలుపు నివారణ చేయలేకపోతే పంట దిగుబడి 50 శాతం మేర నష్టపోయే అవకాశం ఉంది.
- పత్తిలో పంట మార్పిడి చేసుకుంటూ ఉంటే కలుపు పెరుగుదల తగ్గుతుంది. అంతర కృషి చేసుకోవాలి.

ఖర్చు తగ్గుతుంది..



పత్తిలో కలుపు కూలీలతో తీయించడం కంటే.. హ్యాండ్ స్ప్రేయర్లతోనే త్వరగా పనిచేయవచ్చు. అదే విధంగా కలుపు త్వరగా నివారణ అవడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది. నేను 40రోజుల క్రితం ఐదెకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రస్తుతం చేనులో కలుపు పెరగడంతో హ్యాండ్ స్ప్రేయర్ల ద్వారా కలుపు మందు స్ప్రే చేయించా. ఐదెకరాలకు రూ.5 వేల ఖర్చుతో కలుపు నివారణైంది.

– దగ్గుల శ్రీనివాసరెడ్డి, రైతు, తల్లాడ

కలుపు నివారణ చర్యలు..



ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పైరు 40 రోజుల దశలో కలుపు బాగా పెరిగినందున కూలీల చేత సాధ్యం కాక హ్యాండ్ స్ప్రేయర్ల ద్వారా వివిధ రకాల మందులు రైతులు స్ప్రే చేస్తున్నారు. ప్రస్తుతం పత్తిలో కలుపు నివారణకు గ్లూకోజెనేట్ అమ్మోనియంను 13.5 శాతం లేదా 24 శాతం ద్రావకాన్ని ఒక లీటరు నీటికి 5 మి.లీ చొప్పున స్ప్రేయర్ల ద్వారా పత్తి మొక్కలపై పడకుండా స్ప్రే చేసుకొంటే పూర్తిగా నివారించుకోవచ్చు.

– ఎండీ.తాజుద్దీన్, ఏఓ, తల్లాడ

కురిసిన భారీ వర్షం..



ఎర్రుపాలెం: పత్తి చేనులో నిలిచిన వరద నీరు



ఏన్కూరులో..

- రోడ్లన్ని జలమయం
- పత్తి చేలల్లో నిలిచిన వరద నీరు

ఎర్రుపాలెం: మండలంలోని గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాల్లోని పత్తి చేలల్లో భారీగా వరద నీరు చేరుతుంది. మెట్ట పంటలకు ప్రాణం పోసినట్లయింది.

ఏన్కూరు: మండలంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్ని జలమయం అయ్యాయి. ప్రధాన సెంటర్లో నీరు నిలిచి ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టుప్రాంతాల్లోని పత్తి నీటమునిగింది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నీరు నిలిచింది. చెరువులు, కుంటల్లోని వరదనీరు చేరింది.

కొణిజర్ల: వర్షాలకు పగిడేరుకు వరద ఉధృతి పెరిగింది, మంగళవారం రాత్రి, బుధవారం కూడా వర్షం కురిస్తే ఏటి ఉధృతి పెరిగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోనున్నాయి. వాన ధాటికి పత్తి చేలల్లో నీరు చేరింది.

ఇది ముదిగొండ రోడ్లే..



ముదిగొండ సెంటర్‌లో బీటీ రోడ్డుపై నిలిచిన నీటిలో ప్రయాణిస్తున్న వాహనదారులు



ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట రోడ్డుపై నిలిచిన నీరు

ముదిగొండ: జోరు వానలకు ప్రతి సంవత్సరం ముదిగొండ వాసులకు, ప్రయాణికులు ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ముదిగొండ పారిశ్రామిక ప్రాంతం, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట, బస్టాండ్ సెంటర్, వల్లబి రోడ్డులో వాగులను తలపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా, భారీ వర్షానికైనా ముదిగొండ కేంద్రంలో ఈ బాదలు తప్పడం లేదని, రోడ్డు వెడల్పు, సైడ్ డ్రెయిన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, వాహనదారులు ఆగిఉన్న నీటిలోనే రాకపోకలు సాగించాల్సివస్తుంది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, ప్రజల సమస్యలు తీరడం లేదని, త్వరితగతిన సైడ్ డ్రెయిన్లు, రోడ్ల వెడల్పులు పనులు పూర్తి చేసి, సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజల నుంచి వస్తున్న ప్రతీ దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించలే తప్ప.. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, ఐదు మండలాల తహసల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, భూ భారతి సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నందున సిబ్బంది తీరు మార్చుకోవాలని, లేకపోతే కఠిన చర్యలకు వెనకాడబోమని స్పష్టం చేశారు. పలుచోట్ల ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోకుండా.. కేవలం మీసేవ నుంచి ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులకు మాత్రమే రేషన్‌కార్డులు జారీ అవుతున్నాయని వస్తున్న విమర్శలపై అధికారులు స్పందించాలని సూచించారు. టైటిల్‌డీల్ ఇవ్వటంలో కొందరు ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

కాంగ్రెస్‌లో చేరిక..

సత్తుపల్లి మండలం సిద్ధారంలో మంగళవారం వందమంది బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే రాగమయి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్, భాగం నీరజాదేవి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శివవేణు, గాదె చెన్నారావు, ఎండీ కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు, మట్టా చెన్నారావు, గోళ్లమూడి కృష్ణయ్య, కిన్నెర రాంబాబు, పాల్గొన్నారు.

తల్లాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నారాయణ



నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సన్మానించిన జర్నలిస్టులు

తల్లాడ: తల్లాడ మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం తల్లాడ సొసైటీ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సమావేశంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని తీర్మానించారు. ఈ సందర్భంగా తల్లాడ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గుడిపల్లి నారాయణ(సాక్షి), ప్రధాన కార్యదర్శిగా మోదుగు జయరాజు, గౌరవాధ్యక్షుడిగా దుగ్గిదేవర అజయ్‌కుమార్, ఎడి.ముస్తఫా, గౌరవ సలహాదారుడిగా అప్పిరెడ్డి, ఉపాధ్యక్షులు షేక్ మెహరాజ్, గురజాల నారాయణరావు, సహాయ కార్యదర్శులుగా రుద్రాక్ష నరసింహాచారి, అద్దంకి సురేష్, ప్రచార కార్యదర్శిగా గొడ్ల శ్రీనివాసరావు, కోశాధికారులుగా గొల్లమందల నాగబాబు, మేడి రాంబాబుతో మరో 19 మందితో కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 30ఏళ్లగా వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు.

ఏకరూప దుస్తులు పంపిణీ



విద్యార్థికి దుస్తులు అందజేస్తున్న మురళీధర్

వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలకు మంగళవారం వైష్ణవి మిల్క్ ప్రాడక్ట్స్ యజమాని భూతాడ మురళీధర్ ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. తమ సంస్థ ద్వారా బాలికలకు దుస్తులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు తమ సంస్థ ద్వారా పారితోషికాలు అందజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దుర్గాలాల్, రామారావు, సీనియర్ అధ్యాపకులు వీరాస్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఉపాధి చట్టాన్ని రక్షించాలి

సత్తుపల్లిరూరల్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉపాధిహామీ చట్టాని రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా బడ్జెట్‌లో నిధులు కోత పెట్టి కూలీలకు కూలి గిట్టుబాటు కాకుండా అన్యాయం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ ఆరోపించారు. సత్తుపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. సమావేశంలో నాయకులు శ్రీని వాసరావు, పాండు, సర్వేశ్వరరావు,జ్యోతి, రాజబాబు, తిరుపతిరావు, కృష్ణార్జున్‌రావు, విశ్వనాధం, లక్ష్మణ్‌రావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



కొదుమూరులోని ఎరువుల షాప్‌లో తనిఖీ చేస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర

చింతకాని: సరిపడా ఎరువులు ఉన్నప్పటికీ ఎక్కడైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర తెలిపారు. చింతకాని మండలంలోని పలు గ్రామాల సొసైటీలు, ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించాక ఏడీఏ మాట్లాడుతూ రైతులకు అడిగిన ఎరువులు మాత్రమే అందిస్తూ, స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మానస, సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, లచ్చగూడెంలో రైతువేదికలో ఆయిల్ పామ్ సాగు, నానో యూరియా వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఏడీఏ మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాలు సాధించొచ్చని తెలిపారు. కాగా, గుళికల యూరియాకు బదులు ద్రవ రూపంలో ఉండే నానో యూరియా వినియోగం ద్వారా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఏఓ మానస, ఏఈఓ రాము, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించాలి

తల్లాడ: ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా రైతులందరికీ యూరియా అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. మంగళవారం తల్లాడలో నిర్వహించిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్లాక్ మార్కెట్లోకి యూరియా తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన రైతు సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కల్యాణపు కృష్ణయ్య, కార్యదర్శిగా మోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కోటిరెడ్డి, కోశాధికారిగా రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, సత్యనారాయణరెడ్డి, దర్గయ్య, మస్తాన్, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ముదిగొండ: మండలంలోని పండ్రేగుపల్లి తండా, ధనియాలగూడెం, మల్లన్నపాలెం గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. శిబిరంలో మండల వైద్యాధికారి అరుణాదేవి పాల్గొని రోగులను పరీక్షించి మందులు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుసూధన్‌రావు, సూపర్‌వైజర్లు లత, పద్మావతి, పీహెచ్‌ఎన్ రాణి, ఏఎన్ఎం కృష్ణవేణి, నీలావతి, అరుణకుమారి, రత్నకుమారి, వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్వాపురం గ్రామంలో..

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారి అల్తాఫ్ పాల్గొని పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, దోమల ప్రాంతాల్లో నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రేఛల్ రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఏఎన్ఎం జయమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమారుడు దౌర్జనం చేస్తున్నాడని నిరసన

కల్లూరు: స్వార్జితంగా తాము సంపాదించిన భూములపై కుమారుడు దౌర్జన్యం చేస్తున్నాడని తల్లిదండ్రులు కల్లూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. మండలంలోని పుల్లయ్యబంజరకు చెందిన రంగు మోహనరావు – హైమావతి గత మార్చిలో తమ అవసరాల నిమిత్తం బుర్రి నరసింహారావుకు ఎకరం పొలాన్ని విక్రయించారు. ఆ పొలంలోకి నరసింహారావును మోహనరావు పెద్ద కుమారుడు లక్ష్మణరావు రానివ్వకపోవడంతో వివాదం నెలకొంది. భూమితో లక్ష్మణరావుకు సంబంధం లేకున్నా తమను ఇబ్బంది పెడుతున్నందున చర్యలు తీసుకోవాలని మోహనరావు దంపతులు కోరారు. కాగా, తనకు ఇచ్చిన పొలం ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదని లక్ష్మణరావు అక్కడకు వచ్చి అడగడంతో వాగ్వాదం జరిగింది. చివరకు సమస్య పరిష్కారం కాకుండానే అంతా వెళ్లిపోయారు.

వనమహోత్సవానికి స్థల పరిశీలన

తల్లాడ: తల్లాడలో నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమానికి ఎంపీడీఓ సురేష్‌బాబు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. మేజర్ పంచాయతీలోని తల్లాడ – కొత్తగూడెం రోడ్డులో ఉన్న సప్తగిరి వెంచర్‌లో మనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడానికి అనుకూలంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సీ.హెచ్.కోటయ్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, సప్తగిరి వెంచర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ పరిధి తూర్పు లోకవరం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక కానరాకుండా పోవడంతో ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె తల్లిదండ్రులు సోమవారం పొలం వెళ్లొచ్చేసరికి బాలిక లేకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జైళ్లశాఖ ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్



సీడ్ బాల్స్‌తో జైలర్ కుటుంబరాజు, సిబ్బంది

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైల్ ఆధ్వర్యాన ఖైదీలు మట్టితో తయారు చేసిన సీడ్‌బాల్స్‌ను మంగళవారం స్థానిక నీలాద్రి అర్బన్‌పార్కులో జైల్ సూపరింటెండెంట్ యు.కుటుంబరాజు, సిబ్బంది చల్లారు. దాదాపు రెండువేల సీడ్‌బాల్స్ విత్తనాలను అడవులు, అర్బన్‌పార్కులలో చల్లామని ఆయన తెలిపారు. డీజీ సౌమ్యమిశ్ర ఆదేశాల మేరకు వేప, చింత, సీతాఫలం, మద్ది విత్తనాలను చల్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీజే శ్రీనివాస్, హెడ్ వార్డర్ శ్రీనివాస్, వార్డర్స్ సాంబశివరావు, శివకృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసం చేసిన వారిపై..

చింతకాని: మండలంలోని పాతర్లపాడుకు చెందిన సామినేని భద్రయ్య, అల్లూరి గాంధీపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మధిర మండలం దెందుకూరుకు చెందిన చుంచు జ్యోత్స్నకు తల్లిదండ్రులు కట్నంగా ఇచ్చిన వ్యవసాయ భూమిని గత 13ఏళ్లుగా గుర్రాల సైదులు కౌలు చేస్తున్నాడు. ఈసారి ఆయన పత్తి సాగు చేయగా 15వ తేదీన భద్రయ్య, ఆయన గాంధీ ఇరువురు ట్రాక్టర్‌తో పత్తి పంటను ధ్వంసం చేయగా జ్యోత్స్న ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

సంక్షిప్త సమాచారం

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి



భట్టి విక్రమార్కకు సమస్యలు వివరిస్తున్న పాతర్లపాడు గ్రామస్తులు

కల్లూరు: క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ లకు మంగళవారం ఆలిండియా క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్ తన బృందంతో మెమోరాండం అందించారు. క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్, కమ్యూనిటీ హాల్స్, బీసీ సీ సర్టిఫికెట్ ఇవ్వాలని, చర్చిలు నిర్మించుకోవడానికి ఫండ్ ఇవ్వాలని ఏఐసీసీ నాయకులు వినతిపత్రంలో కోరారు. దీనికి మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. టీయూపీసీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాల్మన్‌రాజు, ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, మీడియాసెల్ జిల్లా అధ్యక్షుడు డేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు ఎబినేజర్, ఏఐసీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భట్టికి వినతి

చింతకాని: మండలంలోని నాగులవంచ వద్ద ఉన్న బండిరేవుపై బ్రిడ్జిని నిర్మించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు పాతర్లపాడు గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో బండిరేవు వద్ద వరద ప్రవహిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిధులు మంజూరైన కాంట్రాక్టర్ కారణంగా పనులు నిలిచాయన్నారు. అలాగే పాతర్లపాడు నుంచి నాగులవంచ వెళ్లే రహదారి గుంతలమయంగా మారిందని, రహదారి నిర్మాణం చేపట్టాలని, రైతుల సౌకర్యార్థం 113 రైల్వేగేటును మరల తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్‌రావు, శేషగిరిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కార్యదర్శికి..

ముదిగొండ: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలపై సీపీఎం నాయకులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం అందించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించలేదని, వర్షాకాలం దృష్ట్యా గ్రామంలో పారిశుధ్యం నిర్వహించడం లేదని, బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వీధిలైట్లు వెలగడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దామోదర్, నాయకులు వెంకయ్య, నాగేశ్వరరావు, పద్మావతి, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

కారేపల్లి: మండలంలోని 41 పంచాయతీలకుగానూ నలభై జీపీల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వగా.. ఒక్క సింగరేణి జీపీ(కారేపల్లి)లో నెలరోజులుగా లబ్ధిదారుల ఎంపికలో నెలకొన్న గందరగోళం ఎట్టకేలకు తెగింది. కారేపల్లిలో 75మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా.. టెక్నికల్ సమస్య కారణంగా ఇద్దరి పేర్లు రాలేదు. దీంతో 73మందికి మాత్రమే సింగరేణి జీపీ ఆవరణలో పట్టాలు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా ఇప్పటికే పలువురు ముగ్గులు పోయగా, మరికొంత మంది తొలిదశ బిల్లులు కూడా తీసుకున్నారు. దీంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు

ఏన్కూరు: బాలికలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, తరగతి గదులను, వంటగదిని, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి లావణ్య పాల్గొన్నారు.

దాశరథికి శత గళార్చనతో నివాళి

వైరారూరల్: దిగ్గజ తెలుగు కవి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని చాటి, నిజాం రాజు తరతరాల బూజు అంటూ నిజాం ప్రజావ్యతిరేక పాలనపై తన కలంచే అక్షర క్షిపణుల్ని కురిపించిన కవి వైతాళికుడు దాశరథి అని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకట్రావు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా వైరా మండలంలోని రెబ్బవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 100మంది విద్యార్థులతో దాశరథి రచించిన ఆ చల్లని సముద్రగర్భం గేయాన్ని ఆలపించి శత గళార్చన చేసి నివాళులు అర్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు వేదన, చంద్రశేఖర్, భవాని, కిరణ్, లలిత, నరసింహారావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన వ్యవసాయాధికారి

ఏన్కూరు: మండలంలోని ఆరికాయలపాడులో ఏఓ నర్సింహారావు మంగళవారం కూలీలతో కలసి వరినాట్లు వేశారు. గ్రామంలోని భట్టు హనుమంతురెడ్డి పొలాన్ని సందర్శించి కూలీలతో కలసి నాట్లు వేసి రైతుల్లో ఉత్సాహం నింపారు. వరిసాగులో శాస్త్రీయ పద్ధతులు, మడలదూరం, సేంద్రియ ఎరువులు వాడకం, ఆధునిక పరికారాలపై అవగాహన కల్పించారు.

వ్యాసరచన పోటీలు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా 200కోట్ల మంది ప్రయాణించిన సందర్భంగా ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారత అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఆర్టీసీ సీఐ విజయశ్రీ, సూపర్‌వైజర్లు బాలస్వామి, కిన్నెర ఆనంద్, ఆనందం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం, కాచారం గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, పిచ్చిరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేమిరెడ్డి రంగారెడ్డి, వెంకటప్పారెడ్డి తదితరులున్నారు.

కేరళ మాజీ ముఖ్యమంత్రికి నివాళి

సత్తుపల్లిరూరల్: సీపీఎం అగ్రనేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతిపట్ల సత్తుపల్లి సీపీఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సత్తుపల్లిలో మంగళవారం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, జ్యోతి, పాండు, రాజబాబు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.